క్లుప్తంగా

గిరిజన కాలనీల్లో వ్యక్తిగత సర్వే



నెట్టేరి ఎస్టీకాలనీలో సర్వేచేస్తున్న అధికారులు

నింద్ర: మండలంలోని నెట్టేరి గిరిజన కాలనీలో వ్యక్తిగత సర్వేను గురువారం ప్రారంభించినట్లు ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎస్టీకాలనీ వాసుల స్థితిగతులపై వ్యక్తిగత సర్వేలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో తహశీల్దార్ శేషగిరిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ముక్కరవానిపల్లి సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు గుణ లోకనాథనాయుడు కుమారుడు జి.జ్ఞానప్రకాష్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం అన్నదానంతో పాటు, స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా లోకనాథనాయుడు మాట్లాడుతూ జ్ఞానప్రకాష్ ప్రతి వర్ధంతికి వృద్ధులకు అన్నదానం చేయడం ఆనవాయితీ అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పురంధర్, చిరంజీవిరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, గోవిందనాయుడు, రవిరెడ్డి, రుక్కుబాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



మునిరత్నంరెడ్డి

వెదురుకుప్పం: గంగాధరనెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు, వెదురుకుప్పం ఎంపీటీసీ సభ్యురాలు ఎస్.రాధిక తండ్రి, పచ్చికాపల్లం గ్రామానికి చెందిన ఎస్.మునిరత్నం రెడ్డి మృతి చెందారు. అనారోగ్యంతో తిరుపతిలో స్విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మునిరత్నంరెడ్డి గతంలో పచ్చికాపల్లం పంచాయతీకి సర్పంచ్‌గా సేవలు అందించారు.

గాయపడిన గ్రీన్ అంబాసిడర్

- పట్టించుకోని అధికారులు



గాయపడిన మునస్వామి



మునస్వామి ఐడీ కార్డు

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం పంచాయతీలో గ్రీన్‌అంబాసిడర్‌గా పని చేస్తున్న టి.మునస్వామి కాళ్లు విరిగిపోయినా అధికారులు పట్టించుకోలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. గురువారం ఉదయం బ్యాట వాహనంలో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడడంతో మునస్వామి కాళ్లు విగిపోయాయి. విషయం తెలుసుకున్న బంధువులు ఆయన్ను స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయితే అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి మునస్వామిని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

డిగ్రీ విద్యార్థి హఠాన్మరణం



భాస్కర్ (ఫైల్)

నాగలాపురం : మండలంలోని సురుటుపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ (21) పుత్తూరులో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం తన స్నేహితులతో కలిసి ఉదయం జాగింగ్ వెళ్తుండగా ఉన్నట్టుండి స్పృహ తప్పి కింద పడి పోయాడు. అతడితో పాటు ఉన్న స్నేహితులు అతన్ని వెంటనే సమీపంలోని ఊత్తుకోట్టై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యాధికారులు గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు.


జామలో సస్యరక్షణ ముఖ్యం



శ్రీకావేరిరాజుపురంలో సాగులో ఉన్న జామ తోట



జామ తోటలో బూడిద తెగులు సోకిన ఆకు



పాలసముద్రం: మండల పరిధిలో రైతులు జామ తోటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. శ్రీకావేరిరాజుపురం, అముదాల, బాలక్రిష్ణాపురం, తిరుమళరాజుపురం, వనదుర్గాపురం, వెంగళ్రాజుకుప్పం గ్రామాల్లో విరివిగా రైతులు జామ సాగు చేస్తున్నారు. జామ తోటలు పూత, పిందె, కాయ దశల్లో ఉండగా పక్వానికి వచ్చిన కాయలు కుళ్లిపోతున్నాయి. వివిధ రకాల తెగుళ్లు ఆశించాయి. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓ ఢిల్లీప్రసాద్ ఇలా వివరించారు.

కాయకుళ్లు తెగులు

ఈ తెగులు సోకిన జామ తోటల్లో చెట్లపై నుంచి కింద వరకు కొమ్మలు, రెమ్మలు ఎండి పోతాయి. పండ్లపై గుండ్రటి గోధుమ రంగు మచ్చలు గుంతలుగా ఏర్పడి రెండు ,మూడు రోజుల్లో పండ్లు కుళ్లి, రాలి పోతాయి. దీనిని అరికట్టేందుకు రైతులు ఎండిన రెమ్మలకు, కొమ్మలను వెంటనే కత్తిరించాలి. అలాగే కుళ్లిన పండ్లను తోట నుంచి తొలగించాలి. తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాముల లీటరు నీటిలో కలిపి కాయలు తయారయ్యే సమయంలో 10 నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. ఎండు తెగులు ఆశించిన జామ తోటల్లో పురుగు వేరును ఆశిస్తుంది. దీంతో వేరుపై తెగులు ఆశించిన కొద్ది కాలంలో చెట్టు పైభాగం నుంచి కింద వరకు ఎండిపోతుంది. సాధారణంగా చౌడు రకం, భూసారం లేని భూముల్లో జామ సాగు చేపడితే ఈ తెగులు ఎక్కువగా వ్యాపిస్తుంది. దీని నివారణకు ఒక్కో మొక్కకు కిలో చొప్పున సున్నం లేదా జిప్సం, పచ్చిరొట్ట ఎరువు లేదా పశువుల ఎరువును ఎక్కువ వేయాలి. మొదళ్ల భాగంలో గ్రాము కార్బండిజం లీటర్ నీటిలో కలిపి తడపాలి. 14 రోజుల తరువాత ఎండుటాకులను గుంతలో వేసి కాల్చేయాలి.

పండు ఈగ తెగులు

జామ తోటల్లో దిగుబడి తగ్గడానికి ప్రధాన కారణం పండు ఈగ తెగులు ఆశించడం. కాయలు పక్వానికి రాగానే పండు ఈగ ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు రెండు మిల్లీ లీటర్లు మిథైల్ యూజినాల్, మూడు గ్రాములు కార్బోఫ్యూరాన్ త్రీజీ గుళికలను లీటర్ నీటిలో కలిపి ద్రావణాన్ని తయారు చేయాలి. ఒక్కో ప్లాస్టిక్ పళ్లెంలో 200 మిల్లీ లీటర్ల ద్రావణాన్ని పోయాలి. తోటలో అక్కడక్కడా చెట్టు కొమ్మలకు వేలాడదీయాలి. మగ ఈగలు ఆకర్షణకు గురై ద్రావణంలో పడి చనిపోతాయి. రెండు మిల్లీ లీటర్ల మలాథియాన్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తోటలో పండు ఈగ ఆశించి కింద పడిన కాయలను ఏరివేసి నాశనం చేయాలి.

తెల్లదోమ నివారణ

తెల్లదోమ ఆకులపై చేరి రసాన్ని పీలుస్తాయి. ఆకులు ఎర్రబడి ముడతలు పడతాయి. వీటి నివారణకు జిగురు పూసిన పసుపు రంగు డబ్బాలను రాత్రి వేళల్లో తెల్లదోమ ఆశించిన చెట్ల వద్ద ఉంచాలి. వేప నూనె 0.5 మిల్లీ లీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పిండినల్లి నివారణ

ఈ రకం తెగులు ఆశించిన జామ తోటల్లో కొమ్మల చివర కాయలను పిండి నల్లి ఆశించి కాయల్లో రసాన్ని పీలుస్తాయి. దీంతో కాయలు, ఆకులు రాలి పోతాయి. ఇవి జిగురు పదార్థాన్ని విసర్జించడంతో మసి తెగులు వస్తుంది. ఈ తెగులు నివారణకు అక్షింతల పురుగు బదనికలను తోటలో విడుదల చేయాలి. ఎసిఫేట్ గ్రాము లేదా డైక్లోరోఫాస్ 1 మి ల్లీ లీటరు, లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

గ్రామాల్లో పారిశుధ్య పనులు పరిశీలించండి

నింద్ర: గ్రామాల్లో పారిశుధ్య పనులను పంచాయతీ సభ్యులు పరిశీలించి, చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ అన్నారు. గురువారం నింద్ర మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలలన్నారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులు ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని అన్నారు. ట్యాంకులో నీటిని నింపిన ప్రతిసారి క్లోరినేషన్ చేసి నీరు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

నింద్ర: మండలంలోని ఆరూరు జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని పుత్తూరు అన్నా గౌరి వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలకు 100 రోగాలకు పరీక్షలు నిర్వహించారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులు 200 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల వైద్యాధికారులు తేజ, యమున, రూప, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీవైఈఓ ఇందిర

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉప విద్యాశాఖాధికారి ఇందిర తెలిపారు. గురువారం పాలసముద్రం ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటి నుంచే పదో తరగతిలో వెనుకబడి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత తేవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండు సార్లు పాఠాలు బోధించాలని సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు నాణ్యతగా పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. వారు చక్కగా సమాధానం చెప్పడంతో సంతృప్తి చెందారు. ఆమె వెంట ప్రదానోపాధ్యాయిని మీనాక్షి, ఉపాధ్యాయుడు ధనరాజ్ ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ అంజాద్‌బాషా

పుత్తూరు: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్ఐ అంజాద్‌బాషా సూచించారు. గురువారం స్థానిక పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో యూత్ సర్వీస్ ఆధ్వర్యంలో మత్తుపదార్థాలు–అనర్థాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం నేర ప్రవృత్తిని ప్రేరేపిస్తుందని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసైతే విలువైన జీవితం ఛిద్రమవుతుందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని అధిరోహించాలని సూచించారు. నేటి సమాజంలో విద్యకు మించిన సంపద మరొకటి లేదన్నారు. చదువుమీదే దృష్టి సారించాలని ఈ క్రమంలో ఎలాంటి వ్యామోహాలకు లోనుకాకూడదని సూచించారు. అనంతరం ఈగిల్ క్లబ్ మెంబర్స్‌గా 8 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీకుమార్, యూత్ సర్వీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోహన్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పు ఒకరిది.. కేసు మరొకరిపైనా?

- నిజాన్ని ఎత్తిచూపితే సోషల్ మీడియా వారికి వేధింపులా?
- టీడీపీ సోషల్ మీడియాలో నాపై నీచంగా ట్రోల్స్ చేస్తున్నారు
- వారిపై ఎందుకు చర్యలు తీసుకోరు
- మహిళ అన్న విజ్ఞత కూడా లేకుండా వ్యక్తిత్వ హననం చేస్తున్నారు
- ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి



నగరి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్న నాయకులు, కార్యకర్తలు



మాజీమంత్రి ఆర్కే రోజా

నగరి: ఇసుక, బియ్యం స్మగ్లింగ్ చేసే టీడీపీ నేతలు అడ్డంగా దొరికిపోతే వారు ఎమ్మెల్యే అనుచరులంటూ సోషల్ మీడియాలో పెట్టడం ఎందుకు తప్పవుతుందని, సోషల్ మీడియా వారిని ఎందుకు బెదిరింపులకు గురిచేసి వేధిస్తున్నారంటూ నగరి సీఐ విక్రమ్‌ను మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రశ్నించారు. గురువారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆమె వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా వారిని వేధించడంపై సీఐని వివరణ కోరారు. బియ్యం స్మగ్లింగ్‌లో దొరికిన అమృతరాజ్ అనే వ్యక్తి నగరి పట్టణమంతా ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ బ్యానర్లు కట్టారు, పచ్చ పత్రికల్లో శుభాకాంక్షలు చెబుతూ ప్రకటనలు ఇచ్చారని తెలిపారు. ఆయన ఎమ్మెల్యేకు అనుచరుడు కాకుండా ఏమవుతాడని ప్రశ్నించారు. సంబంధిత వ్యక్తి ఇసుక స్మగ్లింగ్‌లో పాత్రధారి కావడంతోనే బియ్యం, ఇసుక స్మగ్లింగ్‌లో పట్టుబడింది ఎమ్మెల్యే అనుచరుడని సోషల్ మీడియాలో వచ్చిందని అందులో తప్పేముందన్నారు. మహిళాలోకం అసహ్యించుకునేలా, సభ్య సమాజం సిగ్గుపడేలా ట్రోల్ చేస్తున్నారని వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే నీచంగా మాట్లాడితే దాన్ని ఆయన సహచరులే సోషల్ మీడియాలో పెడుతున్నారన్నారు. వ్యక్తిత్వ హననం చేసేలా మాట్లాడిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు.

టీడీపీ ఇసుక మరకను వైఎస్సార్ సీపీకి అంటిస్తున్నారు

ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసిన అనంతరం స్టేషన్ బయటకు వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడారు. ఎక్కడ అక్రమాలు జరిగినా ఆలోచించకుండా వైఎస్సార్ సీపీ ఖాతాలో తోసేయ్... అరెస్టు చేసి లోపలేసేయ్ అన్నదే టీడీపీ సిద్ధాంతమన్నారు. అధికారం, అధికారులు టీడీపీ పక్షాన ఉంటే వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ రాజంపేట నుంచి ఇసుక తరలించడం సాధ్యమా అని ప్రశ్నించారు. తడుకుపేటలో టీడీపీ నేతలు దళితులపై దురుసుగా ప్రవర్తించి వారి బైకులు కాల్చేస్తే కేసు దళితులపైనే పెట్టారని, మీడియా ముందు దళితులు ఊర్లోనే ఉండకూడదన్న టీడీపీ నేతలు దర్జాగా తిరుగుతున్నారన్నారు. దేశూరు అగరంలో అనారోగ్యంతోనే వ్యక్తి మృతిచెందాడని వైద్యులే నిర్ధారించి చెబుతుంటే వైఎస్సార్ సీపీ నేతలపై కేసు నమోదు చేశారన్నారు. క్రిష్ణా జిల్లా జడ్పీచైర్మన్ హారిక రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమానికి వెళుతుంటే ఆమె కారుపై దాడి చేసి హత్యాప్రయత్నం చేసి, తిరిగి వారిపైనే కేసులు పెట్టారన్నారు. ఇసుక తరలించేది ఒకరైతే కేసు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లపై పెడుతున్నారన్నారు. తప్పు ఒకరు చేస్తే కేసు ఒకరిపై పెట్టడం రెడ్‌బుక్ రాజ్యాంగంలోని చట్టాల మేరకే సాధ్యమవుతుందన్నారు. అలాగే నేడు టీడీపీ నేతలు ఇసుక అక్రమంగా తరలిస్తూ అడ్డంగా దొరికిపోతే కేసు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లపై పెడుతున్నారన్నారు. పదవుల కోసం కాదు.. ప్రశ్నించడానికి అన్న నినాదంతో వచ్చిన పవన్ ప్రశ్నించడమే మానుకున్నారన్నారు. ఇలాంటి సుపరిపాలన ఏ రాష్ట్రంలో లేదన్నారు. న్యాయం కోసం కోర్టులను ఆశ్రయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్ రవీంద్ర, మాజీ మంత్రి సోదరుడు రాంప్రసాద్ రెడ్డి, నింద్ర ఎంపీపీ దీప, మున్సిపల్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి శ్యామ్‌లాల్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పుష్ప పల్లకీలో జగదభిరాముడు



సీతారామ లక్ష్మణులకు ఊంజల్ సేవ

తవణంపల్లె : టి.పుత్తూరులోని పురాతన కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం పుష్ప పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అర్చకులు సీతా రామ లక్ష్మణులు, ఆంజనేయ స్వామికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు చేసి దూప దీప నైవేద్యం సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ

ఆలయంలో సాయంత్రం సీతారామలక్ష్మణులకు ఊయల సేవను వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పట్టువస్త్రాలు, గజమాలలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు.

వైభవంగా ఊరేగింపు

కోదండ రామాలయంలో గురువారం రాత్రి స్వామికి పుష్ప పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పట్టు వస్త్రాలు, గజమాల, పుష్పాలు, పూజా సామగ్రితో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం పల్లకీలో జగదభిరాముడు మాడ వీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

నేడు తిరుమంజనం

కోదండరామాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామికి తిరుమంజనం, సాయంకాలం ఊంజల్ సేవ, రాత్రి కల్పవృక్ష వాహన సేవను నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త సిద్దేశ్వర రెడ్డి తెలిపారు.

ఆడిమాస ఉత్సవాలు ప్రారంభం



నేత్రప్రదాయిని క్షేత్రంలో ప్రత్యేక విద్యుత్ దీపాల అలంకరణ



ఆస్పత్రిలో వీల్‌చైర్, దిండ్లు అందిస్తున్న గంగాధర్

నగరి: పట్టణ పరిధిలోని అమ్మవారి ఆలయాల్లో ఆడి నెల ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. నేత్రప్రదాయిని దేశమ్మ దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో, ఆలయకమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయం వద్ద ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో ఆడి నెల ప్రారంభం, మందిర వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలలో మూడు చక్రాల సైకిల్, దిండ్లు, రోగులకు బ్రెడ్లు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. వికలాంగుల పాఠశాలలో విద్యార్థులు 54 మందికి దిండ్లు, దుప్పట్లు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆదిపరాశక్తి ప్రచార కమిటీ అధ్యక్షుడు టి.గంగాధర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్రహ్మణ్యం, వైద్యులు ఆర్‌వీ మంజుల, కార్తికేయన్, జరీనా, లోకేష్, దీప్తి, శ్రీనాథ్, మహేష్ , మౌనిక హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

భూత వాహనంపై కుమారస్వామి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా స్వామి , అమ్మవార్లు గురువారం రాత్రి భూత వాహనంపై పురవీధుల్లో ఊరేగారు.



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

పరిశుభ్రతతో ఆరోగ్యం

తవణంపల్లె : పల్లెల్లో పారిశుద్ధ్యం లోపం లేకుండా చూసుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. గురువారం మండలంలోని ఎ.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌వేలు మాట్లాడుతూ.. పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం గర్భిణులు , బాలింతలు, వృద్ధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.